‘పీఎం సూర్యఘర్’తో రాయితీపై సోలార్ యూనిట్

- శతశాతం సౌర విద్యుత్ గ్రామంగా గుల్లేపల్లిని నిలపాలి
- అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్


సోలార్ రూఫ్ టాప్ అవగాహన కార్యక్రమానికి భారీగా హాజరైన గ్రామస్తులు


దరఖాస్తుదారులకు ఫీజిబిలిటీ సర్టిఫికెట్లను అందిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

సబ్బవరం: దేశ భవిష్యత్తు, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. మండలంలోని గుల్లేపల్లి గ్రామాన్ని సోలార్ మోడల్ గ్రామంగా గుర్తించడంతో గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని శత శాతం సోలార్ గ్రామంగా రూపుదిద్దుకుని, జిల్లాతో పాటు రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలన్నారు. సోలార్ విద్యుత్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా రాయితీ అందిస్తుందన్నారు. దీంతో పాటు మిగిలిన మొత్తానికి అవసరమైతే బ్యాంకులు రుణ సదుపాయాన్ని కల్పిస్తాయన్నారు. ప్రస్తుతం పెట్టే పెట్టుబడి మూడేళ్లలో తిరిగి వస్తుందన్నారు. సోలార్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌లో వాడకం మినహా, మిగులు విద్యుత్‌ను ఈపీడీసీఎల్‌కు విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం వస్తుందన్నారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఉన్న బొగ్గు నిల్వలు తరిగిపోవడంతో భవిష్యత్తు అంతా పునరుత్పాదక ఇంధన వనరులదేనన్నారు. గ్రామంలో సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థ ఏర్పాటుకు డబ్బులు చెల్లించిన వారికి ఫీజిబిలిటీ సర్టిఫికెట్లను అందించారు.

స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ సోలార్ యూనిట్ ఏర్పాటుకు కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లకు రూ.70 వేలు వరకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందన్నారు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని గుల్లేపల్లి గ్రామాన్ని సోలార్ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. శత శాతం సోలార్ సాధించిన గ్రామానికి ప్రభుత్వం రూ.కోటి ప్రోత్సాహకంగా అందించడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు మరిన్ని నిధులు కేటాయిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్ బండారు మంగ, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, డీపీవో శిరీషారాణి, ఎంపీడీవో పద్మజ, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్, ఈఈ నిరంజన్ అంబేడ్కర్, ఏఈలు వీరేంద్ర, అశోక్, గ్రామ పెద్దలు బోకం రామునాయుడు, బండారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలను అందజేశారు. ఆలయ సూపరింటిండెంట్ త్రిమూర్తులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను కొలువుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

అప్పన్న సన్నిధిలో వేద వర్ధన తీర్థ స్వామీజీ


వేద వర్ధన తీర్థ స్వామీజీకి అప్పన్న జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఉడిపిలోని శిరూర్ మఠానికి చెందిన వేద వర్ధన తీర్థ స్వామీజీ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ అందించారు.

యోగా పోటీల్లో జయలక్ష్మి ప్రతిభ



యోగా పోటీలో విజేతగా నిలిచిన పండూరి జయలక్ష్మి

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫస్టియర్ విద్యార్థి పండూరి జయలక్ష్మి ఏయూలో నిర్వహించిన అంతర్ కళాశాలల యోగా పోటీల్లో ప్రథమ నిలిచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి తెలిపారు. వచ్చే నెల 24 నుంచి 28 వరకు భువనేశ్వర్‌లోని కళింగ యూనివర్సిటీలో జరగనున్న జాతీయ స్థాయిలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిబ్బంది, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎల్.గణేష్, విద్యార్థులు జయలక్ష్మిని అభినందించారు.

ప్రభుత్వ, గెడ్డ స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బల్ల రవికుమార్

సింహాచలం: 93వ వార్డు పరిధిలోని ప్రభుత్వ గెడ్డ స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని పెందుర్తి తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు స్థానిక జనసేన నాయకుడు బల్ల రవికుమార్ గురువారం ఫిర్యాదు చేశారు. వార్డులోని 160, 170 సర్వే నెంబర్లలో రామన్నచెరువు గెడ్డకు సంబంధించిన ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వార్డు పరిధిలో ఉన్న ఈస్ట్ పాయింట్‌కాలనీ, సమతాకాలనీ, గణేష్‌కాలనీ, శ్రీనివాసనగర్, భరత్‌నగర్, సాయిమాధవ్‌నగర్ మీదుగా రామన్నచెరువు గెడ్డ సుమారు 200 అడుగులు వెడల్పుతో ఉండేదని, ప్రస్తుతం అది 50 అడుగులకు కుదించుకుపోయిందన్నారు. సర్వే నెం.170 శ్రీనివాసనగర్‌లో 42 సెంట్ల ప్రభుత్వ భూమిని తప్పుడు సర్వే నెంబర్‌తో స్థానికుడు వారి కుటుంబ సభ్యుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించి వ్యవసాయ భూమిగా సాగుచేసుకుంటున్నట్లు ఆరోపించారు. ఆ భూమిలో ప్రభుత్వ నిధులతో గతంలో దోబీఖానా నిర్మాణానికి ప్రతిపాదించారని, వెంటనే దాన్ని స్వాధీనం చేసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్–1 పరిధి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో న్యూ బ్రేకర్ కన్‌స్ట్రక్షన్‌లో భాగంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు సబ్బవరం, తవ్వవానిపాలెం, అమృతపురం, గొల్లలపాలెం, పైడివాడ, అసకపల్లి, ఇరువాడ పంచాయతీల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

97వ వార్డులో ఎమ్మెల్యే పంచకర్ల పర్యటన


స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: 97వ వార్డు పరిధి గిరిప్రసాద్‌నగర్, టీచర్స్ కాలనీ, వెంకటాద్రినగర్‌లో గురువారం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. పార్కుల నిర్మాణానికి సుమారు రూ.2 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత, టీడీపీ నాయకుడు శానాపతి శంకరరావు, జోనల్ కమిషనర్ హైమావతి, టౌన్ ప్లానింగ్, సచివాలయం, రెవెన్యూ అధికారులు, టీడీపీ నాయకుడు అవగడ్డ అప్పలనాయుడు, జనసేన నాయకుడు సోమశేఖర్, కాలనీ నివాసితులు పాల్గొన్నారు.

‘టీకాతోనే బ్రూసెల్లోసిస్ నియంత్రణ’


బోదువలసలో టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న రామ్మోహనరావు

సబ్బవరం: పశువుల్లో సోకే బ్రూసెల్లోసిస్ వ్యాధి నియంత్రణకు టీకాల కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బి.రామ్మోహనరావు సూచించారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణలో భాగంగా మండలంలోని గుల్లేపల్లి, బోదువలస గ్రామాల్లో గురువారం నిర్వహించిన బ్రూసెల్లోసిస్ టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. బ్రూసెల్లోసిస్ వ్యాధికి చికిత్స లేదని నివారణకు టీకాలు ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో గుల్లేపల్లి పశు వైద్యశాల డాక్టర్ సంధ్య, బోదువలస సర్పంచ్ శ్రీనివాసరావుతో పాటు ఆయా గ్రామాల్లోని పాడి రైతులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం జాతీయ పోటీలకు తాన్యా గోస్వామి

పరవాడ: కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ, బీఈఈ ఆదేశాల మేరకు పరవాడ సింహాద్రి ఎన్‌టీపీసీ ఎనర్జీ కన్జర్వేషన్ అంశంపై నిర్వహించిన రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీల్లో ఎన్‌టీపీసీ బాలభారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థిని తాన్యా గోస్వామి ప్రథమ స్థానంలో నిలిచింది. విజేతకు రూ.50 వేలు నగదు బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన గోస్వామి వచ్చే నెల 11న ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి చిత్రకళ పోటీల్లో పాల్గొననున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వాసంతి గురువారం మీడియాకు తెలిపారు. విద్యార్థినితోపాటు, శిక్షణ ఇచ్చిన ఆర్ట్ టీచర్ కేఎస్ కామేష్‌లను అభినందించారు. జాతీయ స్థాయి పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు.

‘ప్రమాద బాధితులను ఆదుకుంటాం’



ప్రమాద స్థలంలో ఎమ్మెల్యే పంచకర్ల, తదితరులు

సబ్బవరం: పరవాడ జేఎన్‌పీసీలోని ఠాగూర్ లేబొరేటరీస్‌లో ప్రమాదం జరిగిన స్థలాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గురువారం సందర్శించారు. ప్రమాద కారణాలపై ఆరా తీశారు. మృతుల కుటుంబాలతో పాటు క్షతగాత్రులను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా నిచ్చారు. మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి కూడా ఘటనా స్థలాన్ని సందర్శించారు. వీరితో పాటు పరవాడ మండల మాజీ ఎంపీపీలు పైల జగన్నాథరావు, మాచరపు అప్పలనాయుడు, పార్టీ నాయకులు వియ్యపు చిన్న, కార్పొరేటర్ ఎం.నీలబాబు తదితరులు ఉన్నారు.

ఫార్మా బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి


పరవాడ: స్థానిక ఫార్మాసిటీలోని ఠాగూర్ కంపెనీలో విషవాయువు లీకై ఇద్దరు మృతి చెందడంతో పాటు, 29 మంది అస్వస్థతకు గురై వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని, వారికి మెరుగైన వైద్యం అందించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబులు కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను గురువారం పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యాన్ని, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మృతులకు చెరో రూ.కోటి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. యాజమాన్య నిర్లక్ష్య వైఖరి వల్లే ఇంత మంది అస్వస్థతకు గురయ్యారని ఆరోపించారు. కార్మికుల ప్రాణాలకు యాజమాన్యాలు ప్రాధాన్యత నివ్వాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి


గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

పెందుర్తి: రాంపురం హైవే బ్రిడ్జి ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని సుమారు 65 ఏళ్ల వృద్ధుడు ఈ నెల 27న మూర్ఛవ్యాధితో పడిపోయాడు. అతడిని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో 108లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం అతను మరణించినట్లు పెందుర్తి సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. మృతుడు 5.6 అడుగులు ఎత్తుతో, చామనచాయ రంగులో ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడు నేవీ బ్లూ ట్రాక్ ప్యాంట్, సిమెంట్ కలర్ ఫుల్ హ్యాండ్స్ షర్టు, వైట్‌కలర్ స్వెటర్ ధరించి ఉన్నాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96039, 96767 97314 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సనాతన ధర్మం పేరిట మహిళల్ని వంచిస్తున్న బీజేపీ


మాట్లాడుతున్న ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని

పెందుర్తి: సనాతన ధర్మం పేరిట ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని మహిళలను దారుణంగా వంచిస్తోందని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, ప్రధాన కార్యదర్శి పి.దుర్గా భవాని, ప్రముఖ అభ్యుదయ రచయిత్రి మల్లేశ్వరి ఆక్షేపించారు. వచ్చే నెల ఢిల్లీలో జరిగే భారత జాతీయ మహిళా సదస్సుని పురస్కరించుకుని జీవీఎంసీ 97వ వార్డు సుజాతానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో సనాతన ధర్మం–మహిళల హక్కులు అనే అంశంపై ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 2014 వరకు దేశంలో మహిళలు అనేక రంగాల్లో అభివృద్ధి దశలో పయనించారని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వంలో మళ్లీ వంటింటికే పరిమితమయ్యారని ఆరోపించారు. హక్కులపై ప్రశ్నించే మహిళలను భక్తిభావం వైపు మళ్లించి దారుణంగా వంచిస్తున్నారని ఆక్షేపించారు. 185 దేశాల్లో మహిళల హక్కులు–వారు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించగా భారతదేశం 145వ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వనజాక్షి, ప్రధాన కార్యదర్శి బేగం, రాణి, పెందుర్తి ఏరియా నాయకులు ఎ.అన్నపూర్ణ, అరుణ, రజని తదితరులు పాల్గొన్నారు.